
# పరమగురువు



ఆ రాత్రి ఆచార్యులవారికి కన్ను పొడుచుకున్నా కంటిమీద రెప్పపడలేదు. నిజానికి ఏ కోణంలోనుంచి ఆలోచించినా ఆచార్యులవారికి ఆ పరిస్థితి ఎదురుకావడానికి ఆస్కారమే లేదు.

ఎలా ఉంటుంది?

ఒక సనాతన సంప్రదాయ శ్రీ వైష్ణవ కుటుంబంలో పుట్టాడు. ఆచార వ్యవహారాలంటే కేవలం మూఢనమ్మకాలుకాదు. మనిషి జీవితాన్ని ఒక క్రమబద్ధం చేసే సాధనాలు అని నమ్మాడు. వాటికి తలవంచాడు. జన్మనిచ్చిన తల్లిదండ్రులు నలుగురిలో తలెత్తుకొని తిరిగేటట్లుగా చదువుకొన్నాడు. తనకు నచ్చిన ఉపాధ్యాయ వృత్తినే స్వీకరించాడు. ఆ వృత్తిలో అంచెలంచెలుగా ప్రధానోపాధ్యాయుల స్థాయికి ఎదిగాడు. ఆ జిల్లాలో ప్రధానోపాధ్యాయుడుగా తనకు తానే సాటి అని పేరు తెచ్చుకొన్నాడు. మూడు దశాబ్దాలకు పైబడి ఎన్నో జ్ఞానజ్యోతుల్ని వెలిగించాడు. తాను ఎన్నుకొన్న మార్గంలో గమ్యం చేరామన్న తృప్తితో పదవీ విరమణ చేశాడు. తాను పుట్టి పెరిగి నడయాడిన ఊళ్ళోనే ఒక ప్రశాంత ప్రాంతంలో అంతకంటే ప్రశాంతమైన కుటీరంలో శేషజీవితాన్ని కొనసాగిస్తున్నాడు.

అలాంటి ఆచార్యులవారికి ఆ రాత్రి నిద్ర పట్టకపోవడం? ఆశ్చర్యమే.

పోనీ ఉద్యోగ జీవితమంటే నల్లేరుమీద నడకలా సాగిపోయింది. సంసారం ఒకటి ఉందిగదా? సాగరాన్నయినా ఈదవచ్చును కానీ అన్న నానుడి సంసారంవల్లనే పుట్టిందిగదా? అంటే_

ఆచార్యులవారు అందగాడు. సృష్టికర్త అని ఎవడైనా ఒకడు ఉంటేగింటే వాడు ఈ ఆకారాన్ని తీర్చిదిద్దడానికి చాలా శ్రమపడి ఉంటాడేమో అనిపిస్తుంది. నిమ్మపండు రంగులో కాసంత గులాబీరంగును కలగలిపితే వచ్చే మనోహరమైన వర్ణం. అరచేతికి ఒక నూలు అటో యిటోగా వెడల్పయిన కండ్లు. ఆ కండ్లల్లో మనిషిని ఆకట్టుకొనే కాంతులు. చక్కని ముక్కు. సన్నని పెదవులు. చిన్న నోరు. మధురమైన కంఠం!

విశాలమైన ఫాలభాగాన్ని రెండు సమభాగాలుగా విభజిస్తూ సన్నని ఎఱ్రనామం, మల్లెపూవును మరపించే తెల్లని పంచెను గోచిపోసికట్టి...గోధుమ రంగు సిల్కు జుబ్బా తొడిగి పైకండువాతో ఆచార్యులవారు నడుస్తూ ఉంటే ఉపాధ్యాయుడంటే ఇలా ఉండాలి అని ఎవరైనా అంటారు.

ఆ అందగాడికి అందకత్తె అనుకూలవతి అయిన భార్య దొరకడం విశేషం. ఒక శుభముహూర్తంలో పెద్దల ఆశీస్సులతో ఒకరు ఇద్దరయ్యారు. ఆ ఇద్దరికి ఇద్దరు. ఒక మగ. ఒక ఆడ. ఆడపిల్లను యుక్తవయస్సు రాగానే చక్కని సంబంధం చూసి ఒక ఇంటిదానిని చేశారు. మగపిల్లవాడు తండ్రికి తగిన తనయుడు. యం.ఎ.లో బంగారుపతకాన్ని సాధించాడు. ఎన్నో పోటీపరీక్షలతో పోటీపడుతూ తనకు పోటీలేదనిపించుకొంటున్నాడు.

ఆచార్యులవారి జీవితం వడ్డించిన విస్తరి. అయినా ఆ రాత్రి ఆచార్యులవారికి నిద్ర పట్టలేదు.

అదే ఆశ్చర్యం!

సరిగా ఆరోజుకు పది పన్నెండు రోజులకుముందు ఒక కుర్రవాడు ఆచార్యుల ఇంటికి వచ్చాడు. శాంతినికేతన్ రెసిడెన్షియల్ కళాశాల సారస్వత సంఘ కార్యదర్శిగా తన్నుతాను పరిచయం చేసుకొన్నాడు. ఆచార్యులు ఆ కుర్రవాడిని సాదరంగా ఇంటిలోకి ఆహ్వానించాడు. కుర్చీ చూపించి కూర్చోమన్నాడు. అయినా ఆ కుర్రవాడు కూర్చోకుండా నిలబడి_

"అయ్యా! మా కళాశాల వార్షికోత్సవం ఈ నెలాఖరున జరుపుకోదలిచాం. ఒక ఉత్తమ ఉపాధ్యాయులుగా మీరు చేసిన సేవలతో విద్యార్థిలోకం మీకెంతో ఋణపడిఉంది. కళాశాల వార్షికోత్సవ సందర్భంలో అమూల్యమైన తమ ఉపన్యాసం ఆ తర్వాత సన్మానం. మా కళాశాల సారస్వత సంఘం తరపున ఆహ్వానిస్తున్నాను. తాము దయతో అంగీకరిస్తే మమ్మల్ని మేమే గౌరవించుకొన్నంత తృప్తి" అని సవినయంగా మనవిచేశాడు.

ఆచార్యులు అదొక విధంగా నవ్వాడు.

ఆ నవ్వును అర్థంచేసుకోలేకుండా ఆ కుర్రవాడు ఇబ్బందిగా ముఖం పెట్టే_

"నాయనా! నీ ప్రవర్తన నాకు నచ్చింది. నీమాట తీరు అంతకంటే బాగా నచ్చింది" అన్నాడు ఆచార్యులు.

ఆ కుర్రవాడి మొగం విరిసిన దిరిసెన అయింది.

"అయితే నేను నీ అభ్యర్థనను అంగీకరించలేకపోతున్నాను. నన్ను క్షమించు."

విరిసిన దిరిసెన ఒకకాలికిందపడి నలిగినట్లు పాపం! ఆకుర్రవాడిమొగం వసివాడింది. అయినా తమాయించుకొని–

"ఎంతమాటెంతమాట. సాక్షాత్ విద్వత్‌స్వరూపులు మీరు. మీరు అలా మాట్లాడడం భావ్యంకాదు. మీరు మా అభ్యర్థన తప్పక మన్నించాలి. మా సన్మానాన్ని స్వీకరించాలి. అమూల్యమైన తమ సందేశంతో విద్యార్థిలోకాన్ని ఉత్తేజితం చేయాలి"

ఆచార్యులు తలవంచుకొని కాస్సేపు ఆలోచనలో పడ్డాడు.

ఆ తర్వాత–

"నాయనా! నువ్వు నన్ను ఒప్పించడానికి ప్రయత్నిస్తున్నావు. నేను నిన్ను నొప్పించక తప్పడంలేదు. చూడుబాబూ! హాయిగాఎగిరే రామచిలుకను పట్టితెచ్చి ఒకపంజరంలో బంధించినట్లుంది ప్రస్తుతం నా పరిస్థితి. పంజరంలో బంధించిన రామచిలుకకు స్వేచ్ఛ ప్రసాదిస్తామంటే అది వద్దంటుందా? అలాగే నేనూ మీ కళాశాలకు రావాలనీ...సన్మానాల మాట ఎటున్నా– విద్యార్థులకు నాలుగు హితవు మాటలు చెప్పాలని ఉంది. అయితే నేటి విద్యార్థులు నాటి విద్యార్థులుకాదు నాయనా! ఇప్పటి విద్యార్థులకు కావలసింది నావంటి వ్యక్తులు కాదు. నేను చెప్పే హితవు వాక్కులూ కాదు. వాళ్ళకు కావలసింది– సినిమా హీరోలు కాకుంటే రాజకీయ నాయకులు. అలాంటి వాళ్ళకోసం ప్రయత్నించు. నాలాంటివాళ్ళను ఆహ్వానించి నువ్వు అభాసపాలై నన్ను అవమానంపాలు చేయవద్దు" అని అరటిపండు వొలిచి చేతిలో పెట్టినట్లుగా చెప్పిచూశాడు.

అయినా ఆ కుర్రవాడు ఉడుంపట్టు వదలలేదు.

తన కళాశాల విద్యార్థులు అలాంటివాళ్ళు కాదన్నాడు. ఎలాంటి హెచ్చుతగ్గులు జరిగినా దానికి తాను బాధ్యత వహిస్తానని హామీలు గుప్పించాడు. అంగీకారం తెలిపే వరకూ మెడపట్టి గెంటినా తాను కదలనని భీష్మించి కూర్చున్నాడు. ఆ లేత మనసును నొప్పించడం ఇష్టంలేకుండా ఒప్పుకుంటే ఏమయింది?

తాను ఏది ఊహించాడో అది అక్షరాల జరిగిపోయింది.

కుర్చీలోనుంచి లేచి తాను మైక్ ముందుకు రాగానే ఈలలు... చప్పట్లు... 'ఈ పాత చింతకాయపచ్చడి వద్దు. మాకొద్దేవద్దు.' అన్న అరుపులు.

ఆచార్యులకు తలకొట్టేసినంత పనిఅయింది.

రసాభాస అయిన ఆసభలోనుండి ఎలా బయటపడ్డాడో?... ఏమో? ఎలా తనఇల్లు చేరుకొన్నాడో? సారస్వత సంఘ కార్యదర్శి ఏమయ్యాడో? అతడు గుప్పించిన హామీలు

ఏమయ్యాయో? దేవుడికే ఎరుక. తేనెకోసం వెళ్ళి తెనెటీగల బారినుండి బయటపడినంత పని అయింది.

ఆ రాత్రి అన్నం ముందు కూర్చుంటే ముద్ద మింగుడు పడలేదు.

వెళ్ళి పడుకొంటే కంటిమీద రెప్ప పడలేదు.

గతం వర్తమానాల సంఘర్షణ. తన ముప్పై ఏండ్ల ఉపాధ్యాయ జీవితంలో ఎప్పుడూ ఎక్కడా ఎదురుకాని పరిస్థితి. మనసు వికలమై పోయింది. ఎంత ప్రయత్నించినా పడక పొందలేదు. పైకిలేచాడు. ఆ కుటీరం చుట్టూ ప్రదక్షిణలు చేశాడు. వెళ్ళి కాసేపు టీవీముందు కూర్చున్నాడు. ముండ్లమీద కూర్చున్నట్లుంది. లేచి తనకు ప్రీతి పాత్రమైన పోతన భాగవతాన్ని తీసుకొన్నాడు. మనసు లగ్నం కాలేదు.

గతం ప్రస్తుతాన్ని అవహేళన చేస్తూ ఒక దృశ్యకావ్యంలా కనులముందు మెదులుతూ ఉంది.

భర్తబాధను పంచుకొందామని ఆచార్యుల శ్రీమతివచ్చి ముందునిలబడింది.

ఆచార్యులు తలపైకెత్తి ఆమె మొగంలోకి తీక్షణంగా ఒక చూపు చూశాడు.

ఆమె తల వాలిపోయింది. మెల్లగా వెనుకకు తిరిగింది. అడుగుమీద అడుగ్గా అక్కడనుంచి వెళ్ళిపోయింది.

ఆచార్యులు గతంలోకి వెళ్ళిపోయారు.

ఆ రోజుల్లో ఏ పాఠశాల లేదా ఏ కళాశాల వార్షికోత్సవమైనాసరే! విధిగా తన ఉపన్యాసం ఉండి తీరవలసిందే. తాను గళము విప్పితే తన్మయత్వంతో తలలు పంకిస్తూ వినేవాళ్ళు. ప్రతి అయిదు నిముషాలకొకసారి చప్పట్లు మారుమోగుతుంటే ఆ ఊపులో ఒక ప్రవాహంలా సాగిపోయేది తన ఉపన్యాసం. దాదాపు రెండుగంటలసేపు సభ తన అధీనంలోనే!

ఉపన్యాసానంతరం బారులు తీరి విద్యార్థులు పాదాభివందనాలు చేస్తూ... ఆశీస్సులు అందుకొంటూ–

మరీ కొందరు పెద్దలైతే–

"ఆచార్యులవారూ! నిజంగా తెలుగుభాషకు ఇంత తీపిదనం ఉందా? లేక మీ గళంలోనే అంత తీపిని సంతరించుకొందా?" అని అడిగేవాళ్ళు.

తాను బయలుదేరుతూ ఉంటే సాగనంపడానికి తన్ను చుట్టుముట్టి ఎంతమంది? వాళ్ళ పెదవులపైన చిరునవ్వు...వాళ్ళ కండ్లల్లో తొణికిసలాడే సంతృప్తి! అంతమంది మనసులను రంజింపచేసిన తనకూ ఎంత తృప్తి? అలాంటిది ఈరోజు ఏమయింది?

బ్రతుకుజీవుడా అని బయటపడవలసి వచ్చింది.

ఈచేదు అనుభవం ఎంత ప్రయత్నించినా ఆచార్యులకు మింగుడు పడలేదు.

ఈ మార్పుకు కారణం?

ఆచార్యులు తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

నాగరీకుడైన మనిషి తిరోగమిస్తున్నాడా లేక పురోగమిస్తున్నాడా? ఆనాటి విద్యార్థుల్లో ఒక తరగతిలో వెదికితే ఏ ఒక్కడో ఇద్దరో పనికిరానివాళ్ళు. ఇప్పటి పరిస్థితి పూర్తిగా అడ్డం తిరిగింది. ఒక తరగతిలో ఏ ఒక్కడో ఇద్దరో పనికొచ్చే వాళ్ళు. ఈ పరిస్థితి ఇలానే కొనసాగితే భావిభారతం గతి ఏమవుతుంది? చేయి దాటిపోతున్న ఈ పరిస్థితిని ఎవరు అదుపు చేయాలి? ఎలా అదుపు చేయాలి? ఈతరం తల్లిదండ్రుల మాట వినడంలేదు. ఉపాధ్యాయుల మాటంటే అసలు లెక్కలేదు. ఇక మతప్రవక్తల హిత బోధనలంటే అవహేళన. తరంగాని తరంగా తయారవుతున్నదే ఈతరం!

ఈతరం ఇలా తయారుకావడానికి కారణం. స్వయంకృతాప రాధమా? కాదు. రౌతు మెత్తనయితే గుర్రం మూడు కాళ్ళతో స్వారిచేసినట్లు– వాళ్ళను తీర్చిదిద్దవలసిన ఉపాధ్యాయ వర్గంలో కూడా చిత్తశుద్ధిలోపించింది. వృత్తిధర్మాన్ని అంకితభావంతో ఉపాధ్యాయుడు నిర్వహించక పోవడం ఒకపెద్దలోపం. విద్యార్థుల విశృంఖలత్వానికి అదేకారణం. కాదు అంటే– ఆ సభలో విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులూ ఉన్నారు కదా?– సభరసాభాసం కావడానికి వాళ్ళ బాధ్యత లేదా?– అరికట్టే శక్తిలోపించిందా?

గౌతమబుద్ధుడు, మహాత్మాగాంధీల అహింసావాదాలు... హితోక్తులు చాచానెహ్రూ శాంతి వచనాలు... రామకృష్ణ పరమహంస వివేకానందుల ఆధ్యాత్మప్రబోధనలు కదిలించిన ఈ పుణ్యభూమిలో ఎటుపోతూవుందీ యువత? నాటి యువత నేటి యువతకు మార్గదర్శకం కాదా?

ఇలా ఆలోచిస్తున్న ఆచార్యుల దృష్టిలో ఆ హాల్లో గోడమీద వేలాడుతున్న వివేకానందుడి చిత్రపటం పడింది.

ఆ మహానుభావుడు ఏమన్నాడు?

"ఆధ్యాత్మధర్మమును జారవిడిచితిరేని, దానిని అవల త్రోసివేసి పాశ్చాత్యుల ప్రాపంచిక నాగరకత వెంట పడితిరేని దాని ఫలితార్థముగా మూడు తరములలో మీజాతి వినాశము చెందును. మీ జాతీయభవన పునాదులు పెల్లగిల మీజాతి సర్వనాశనము చెందును.

కావున స్నేహితులారా! దీనిని తప్పించుకొనుటకు మార్గము ఒక్కటే కలదు. ఈ ఆధ్యాత్మ ధర్మమును మనము గట్టిగా పట్టుకొని యుండవలెను. మన ప్రాచీనులు మనకు కరుణించివొసగిన అమూల్య వరప్రసాదమిదియే. మీకు ఆధ్యాత్మధర్మమునందు నమ్మకమున్నను లేకపోయినను జాతీయ జీవనము కొరకైనను మీరు ఆధ్యాత్మధర్మమును చేపట్టి దీనిని అనుసరింపవలసియున్నది" అని ఎప్పుడో స్వామి వివేకానంద యువతను హెచ్చరించాడు కదా? ఎవరు పట్టించుకొంటున్నారు. పట్టించుకుంటే ఈ పరిస్థితి ఎందుకు కలుగుతుంది?

ఇలాంటి ఆలోచనలతోనే ఆ రాత్రి ఆచార్యులవారికి శివరాత్రి అయింది.

తెల్లారింది.

సాధారణంగా ప్రతిరోజు ఆచార్యులు కడజాముల్లో తొలిఘడియల్లోనే నిద్రలేస్తాడు.

కాలకృత్యాలు తీర్చుకొంటాడు. కనీసం ఒక్క మైలు దూరం నడుస్తాడు. తిరిగి ఇల్లు చేరుకొంటాడు. చన్నీటి స్నానం చేస్తాడు. పూజాకార్యక్రమాలు నిర్వహిస్తాడు. ఆ తర్వాత వార్తాపత్రిక ముందు కూర్చుంటాడు ప్రతి అక్షరాన్ని పట్టిపట్టి చూస్తూ-

అలాంటివ్యక్తి ఆరోజు భల్లుమని తెల్లవారినా పడకమీదనుండి పైకిలేవలేదు. వెల్లకిలా పడుకొని వైకప్పు వైపు తదేకంగా చూస్తున్నాడు.

ఇప్పుడు ఆచార్యులు తనకు జరిగిన అవమానాన్ని గురించి ఆలోచించడంలేదు.

తన తాత తండ్రులది మొదటితరం. తనది రెండవతరం. ఇప్పటి విద్యార్థిలోకం మూడవతరం. గమ్యం అగమ్యంగా ఒక క్రమపద్ధతికి కట్టుబడకుండా వ్యవహరిస్తున్న ఈ మూడవతరం స్వామి వివేకానంద ఊహించినట్లు వినాశనం చెందవలసిందేనా?

హే భగవాన్!

ఆచార్యుల గుండెల్ని చీల్చుకొని ఒక వేడి నిట్టూర్పు!!

సరిగ్గా అదే సమయంలో ఆయన ఇంటిముందు ఒక కారు నిలబడింది.

అది నాలుగు బారల పొడవు కారు. అందులో నుండి దిగిన వ్యక్తి ఆరడుగుల ఎత్తు. ఆ వ్యక్తి ఒక్కక్షణం నిలబడ్డాడు. ఆ కుటీరంవైపు తేరిపార చూశాడు. గత స్మృతితోనేమో తల పంకించాడు. చిరునవ్వుతో పెదవులు విచ్చుకొన్నాయి. అడుగు ముందుకు వేశాడు.

కొన్ని క్షణాల్లో కాలింగ్‌బెల్ మోగింది.

"ఏంవండీ! మీలోకంలో మీరుంటే ఎలాగండీ. నేనేమో స్నానాలగదిలో ఉన్నా. వెళ్ళిచూడండి ఎవరొచ్చారో?" ఆచార్యుల భార్య హెచ్చరించింది.

ఆమాటతో ఆచార్యులు పైకిలేచారు. ఆ గదిలో అద్దం ముందు నిలబడ్డాడు. కండ్లు ఎర్రగా ఉన్నాయి. మొగం వసివాడింది. రెండు అరచేతులు జోడించి ముఖాన్ని రుద్దుకొన్నాడు. పై కండువా అందుకొన్నాడు. విప్పదీసి వొళ్ళంతా కప్పుకొన్నాడు. పరధ్యానంలో అడుగుమీద అడుగుపడుతూ ఉంటే వాకిట్లోకి నడిచాడు.

తలుపు తీశాడు.

ఆరడుగుల మనిషి కొర్రకంకులా వంగి ఆచార్యులకు పాదాభివందనం చేశాడు.

"ఎవ్వరితను? ఎప్పుడూ ఎక్కడా చూసినట్లుగా మతికిరావడంలేదే? తెల్లవారేసరికే రావడం, పాదాభివందనం చేయడం. ఏమిటిది?" అని ఆశ్చర్యపడుతూ అయోమయంగా అతని మొగంలోకి చూస్తున్నాడు.

"నేను మీ శిష్యుణ్ణి సార్" అన్నాడు చిరునవ్వుతో వచ్చిన వ్యక్తి.

"అలాగా నాయనా!...చాలాసంతోషం. చాలాసంతోషం!... రా నాయనా రా!" అంటూ ఆచార్యులు ఆగంతుకుణ్ణి సాదరంగా ఆహ్వానించాడు. అతడు లోపలికి రాగానే అతనిని కూర్చోమని కుర్చీ చూపిస్తూ తానూ కూర్చున్నాడు.

"మీ శిష్యకోటిలో నేనూ ఒక్కణ్ణి. అయితే శిష్యులందరికి గురువు గుర్తుంటారు. కానీ గురువులకు శిష్యులందరు గుర్తుండడానికి వీల్లేదు"

ఆచార్యుల అందమైన పెదవులమీద ఒక దరహాసరేఖ!

"అయితే నేను మాత్రం మీకు గుర్తుంటానని అనుకొంటున్నాను సార్"

ఆచార్యులు ప్రశ్నార్థకంగా మొగంపెట్టాడు.

"ఈరోజు నేనీస్థితికి రావడానికి కారకులు మీరేసార్"

"నేనా?"

"అవునుసార్?"

"ఏదో మీరంటున్నారు. నేను వింటున్నాను. అంతేగానీ..."

"సార్, సార్! నేను మీ శిష్యుణ్ణి. దయచేసి బహువచనాలతో నన్ను బాధపెట్టకండి. ఆరోజు మీరే నన్ను పట్టుబట్టి హైస్కూల్‌నుండి బయటికి గెంటించకుండా ఉంటే ఈరోజు నేనూ అందరిలాగే సర్టిఫికెట్లు చేతపట్టుకొని ఉద్యోగాల వేటలో తిరుగుతుండే వాడిని"

"నేను నిన్ను!... బయటికి గెంటించానా?"

"అవునుసార్! అప్పుడు కృష్ణధూర్జటిగారు తెలుగు పండితులు. ఒకరోజు తెలుగుపాఠం చెబుతున్నారు. ఏదో వ్యాకరణ సూత్రం చెప్పమని నన్ను ప్రశ్నించారు. నేను నవ్వుతూ లేచి నిలబడ్డాను. 'అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పలేని ఈ నవ్వు ముఖాలకంటే కోతిముఖాలే నయం అని 'ఎగతాళి' చేశాడు. తరగతి గొల్లుమనింది. ముఖ్యంగా ఆడపిల్లలు. అంతే! ఒక్కఊపులో ఆయన వద్దకు దూసుకొని వెళ్ళాను. చెంప ఛెళ్ళుమనిపించాను. ఆయన కండ్లల్లో నీళ్ళు గిర్రున తిరిగాయి. 'ఈ ఏడుపు మొగాలంటే అసలు నాకు గిట్టదు' అంటూ తరగతినుండి వెళ్ళిపోయాను.

"నువ్వేనా ఆ పనిచేసింది?"

"అవునుసార్. ఆ తర్వాత ఎన్ని క్షమాపణలు చెప్పినా... ఏడ్చి మొత్తుకొన్నా... అందరు 'పోనీలే! ఏదో కుర్రకుంక. చేసింది పిల్లచేష్ట. వాడి భవిష్యత్తును పాడుచేయడం ఎందుకు?' అని రాజీపడినా మీరు మాత్రం కాదంటే కాదన్నారు. టీసీ చేతికిచ్చి నన్ను బడినుండి బయటికి పంపేవరకు ఒంటికాలిమీద నిలబడ్డారు. బయటపడ్డాను. అయితే ఇంట్లో... వీధిలో... గురువునే కొట్టిన ద్రోహి! అన్న అపవాదునుండి బయట పడలేకపోయాను. ఆ స్థితిలో ఆ వయస్సులోనే నిలబడి ఆలోచించవలసి వచ్చింది. జీవించడానికి మనిషికి డబ్బు కావాలి. ఆ డబ్బు సంపాదించడానికి చదువే కావాలా? అవసరం లేదనిపించింది. ఇల్లు వదలి వెళ్ళిపోయాను.

బొంబాయి చేరాను.

మాష్టారూ! అంతవరకు బాగుంది. అయితే అక్కడనుంచే ఆరభంమయింది- అసలుకథ. అదొక మహానగరం. అదొక మాయాలోకం. క్షణక్షణమూ ఒక కొత్త అనుభవం. ఆ అనుభవం మిగిలించేది బాధ. చెప్పుకుందామంటే భాషరాదు. అయినా ఎవ్వరున్నారు చెప్పుకోవడానికి?

ఎన్ని కష్టాలో...ఎన్ని కన్నీళ్ళో...గతాన్ని తలుచుకొని పశ్చాత్తాపడుతూ ఎన్ని నిద్రలేని రాత్రులో?...కడకు ఫుట్‌పాత్ మీద బతుకుల్లో ఒక బతుకయింది. ఆ బతుకులు విచ్చలవిడిగా ఒళ్ళమ్ముకొంటున్నాయి. తారుస్తున్నాయి. దొంగతనాలు చేస్తున్నాయి. జేబులు కత్తిరిస్తున్నాయి. అలా చేస్తున్నామని ఆ బతుకులకు సిగ్గుఎగ్గూ లేదు. అదికూడా జీవితంలో ఒకభాగమే అని భావిస్తున్నాయి. ఆ బతుకులతో ఇమడలేను. తిరిగి ఇల్లు చేరలేను.

ఒకరోజు గేట్‌వే ఆఫ్ ఇండియా వద్ద నిలబడ్డాను.

అది నా జీవితానికే గేట్‌వేగా తోచింది. ఈ దేశంలో హత్యలకు గురి అవుతూ ఎందరో గొప్పగొప్ప మహాత్ములు. మంచి మంచి మనుషులు. సాధింపులు వేధింపులు పడలేక ఆత్మహత్యలు చేసుకొంటున్న అభంశుభం ఎరగని అమ్మాయిలు. ఆకలి రక్కసికి బలిఅవుతూ ఎందరో నిర్భాగ్యజీవులు– అలాంటపుడు నేనేముంది? సముద్రంలో కాకిరెట్ట!

ఒక నిర్ణయానికి వచ్చేశాను. అయినా సమయం ఆసన్నం కావాలికదా?

సరిగ్గా ఆ సమయంలో ఒక మహానుభావుడి కృపాదృష్టి నామీద పడింది. అతని స్కూటర్ ఫ్యాక్టరీలో బాయ్‌గా చేరాను. మాష్టారూ! గతానుభవం నా భవిష్యత్తుకు బాటవేసింది. పట్టుదల పెరిగింది. ఆయన తలలో నాలుక అయ్యాను. స్కూటర్ విడిభాగాల్లో బోర్, పిష్టన్ చాలా ముఖ్యమైన భాగాలు. వాటి తయారీలో ప్రావీణ్యత సంపాదించాను. ఆ ప్రావీణ్యత.. ఆ వయస్సుకే ఓపినంత జీవితానుభవం... కొంత డబ్బుతో మన ఊరికి తిరిగి వచ్చాను. ప్రారంభం ఒక చిన్న ఫ్యాక్టరీ. ఇప్పుడు అది ఒక పేరొందిన సంస్థగా రూపొందింది. ఇప్పుడు మన సంస్థలో తయారవుతున్న బోర్ పిస్టన్‌లకు విదేశీ మార్కెట్‌లో కూడా మంచి గిరాకీ ఉంది. ఇదంతా తమ చలవే"

"ఇందులో నేను చేసిందేముంది నాయనా? నీకృషి నీ పట్టుదల..."

"నాలో పట్టుదల... ఆపట్టుదలతో కృషి పెరగడానికి దోహదం చేసింది మీరేగదా?"

"ఆరోజు నీవుచేసింది తప్పు. తప్పుచేసిన వాడెవడైనా శిక్ష తప్పక అనుభవించాలన్నది నా అభిమతం. అది మరొక విధంగా నీకు తోడ్పడటం నీ అదృష్టం"

"అదిసరే అనుకుందాం. ఇప్పుడు నాదొక చిన్నవిన్నపం"

"చెప్పయ్యా"

"మీ ఒక్కగానొక్క కొడుకు. ఒకప్పటి నా క్లాస్‌మేట్. పోటీ పరీక్షల్లో తనకు పోటీ లేదంటూ నెగ్గుకొస్తున్నాడు. అయితే ఇంటర్వ్యూలో తప్పుతున్నాడు."

"ఏంచేద్దాం? వాడు ఇంకా ఇంటర్వ్యూలను ఎదుర్కొనే పరిణతి సాధించలేదు"

"అదే పొరబాటు. ఈ రోజుల్లో ప్రావీణ్యత.. పరిణతికాదు కావలసింది. ఇంటర్వ్యూలకు డబ్బుకు లేదా రికమండేషన్‌లకు అవినాభావ సంబంధం...'

"నువ్వేమంటున్నావ్?.." అచార్యుల భృకుటి ముడిపడింది.

"అలా కోపగించుకుంటే నేనేం చెప్పగలను?"

"నువ్వేమీ చెప్పనక్కరలేదు. ఆ అవసరమూ నాకు లేదు"

"సాయంచేసి ఋణవిముక్తుడు కావాలనుకోవడం నా స్వార్థమైనా ఇది మీ అవసరం కూడా. ఆలోచించండి. కాలంమారింది. కాలంతోపాటు మనిషి కూడా మారాలి. తరాల్లో అంతరాల్ని గ్రహించకపోతే ఎలా? ఇప్పుడు మీరు ఆలోచించినట్లు మీ కుమారుడు ఆలోచించలేకపోవచ్చు. భవిష్యత్తులో వాడి కొడుకైనా అంతే. వాడు నిరాశానిస్పృహల్లోపడి నలుగుతున్నాడు.

'ఎందుకీజన్మం. ఎవరికీ ఉపయోగపడని ఈ జన్మ ఉంటే ఏమి? ఊడితే ఏమి?' అని నిరాశానిస్పృహలకు లోనయ్యాడు. అదే నిరాశానిస్పృహలతో ఒకనాడు నేను రైలుపట్టాల వెంబడి పయనించాను. లోకాన్ని చూశాను. అనుభవాన్ని గడించాను. ఆ అనుభవంతో ఇప్పుడు రెండు చేతులా గడిస్తున్నాను. అదే మీకుమారుడు ఎంతో తెలివితేటలు ఉండి ఎన్నో పోటీపరీక్షల్లో నెగ్గి రైలు పట్టాల మధ్య నిలబడ్డాడు. అందుకే చెప్తున్నాను. నీతి నిజాయితీలంటూ కొడుకు ఆత్మహత్యకు దోహదం చేస్తారో... లేక ప్రయోజకుణ్ణి చేస్తారో మీ ఇష్టం" అంటూ ఆచార్యుల మాటకు ఎదురు చూడకుండా పైకి లేచాడు. చేతిలోని లెదర్ బ్యాగ్ అక్కడున్న టేబుల్ మీద పెట్టాడు. ఒక్క విసురులో ఇంట్లో నుండి బయటపడ్డాడు.

కారు ముందుకు దూసుకొనిపోయింది.

ఆచార్యులు ఆలోచనలో పడ్డాడు.

ఆయన ఆలోచనలకు ప్రతీకగా పైన పంకా తిరుగుతూ ఉంది.

అయిదు కట్టలు అన్నీ కొత్త వందరూపాయల నోట్లు.

"దీనికోసం మీరింతగా మధనపడవలసిన అవసరంలేదు నాన్నా"

ఆచార్యులు తల పైకెత్తాడు.

ఎదురుగా కొడుకు!

"బాగా ఆలోచించండి నాన్నా! నాకు ముప్పైసంవత్సరాలు నెత్తికొస్తున్నాయి. అంటే భారత ఆయుఃప్రమాణంలో సగం. జీవితకాలంలో సగం చదువుతోనే గడిచిపోయింది. అయితే ఈ చదువు ఎవరికి ఉపయోగపడింది? నాకా? నన్ను కనీపెంచిన తల్లిదండ్రులకా? పోనీ, దేశానికా?"

"అంటే చదువుకోవటం తప్పని వాదిస్తున్నావా?"

"కాదు...చదువు విజ్ఞానంకోసం మాత్రమే. సంపాదన కోసంకాదు. చదువుకు, సంపాదనకు సంబంధమే లేదు."

ఆచార్యులు మాటలు రానివాడిలా కొడుకుమొగంలోకి తదేకంగా చూస్తున్నాడు.

"నాన్నా! ఇంతకాలంగా నేను పుస్తకాల పురుగును మాత్రమే. ఏ జీవితపుటల్లోకి తొంగిచూడలేదు."

"ఎంతసేపూ ఆబ్జెక్టివ్ టైప్... జనరల్ నాలెడ్జి... ఇంగ్లీషు అన్న ధ్యాసేకానీ ఈ ఒక్క ఊళ్ళో ఉన్న వందలాది కాన్వెంట్లు... వాటిలో చదువుకొంటున్న వేలాదిమంది పిల్లలు నాకంటపడలేదే? ఆ పిల్లలందరి దృష్టి ఉద్యోగసాధనే కదా? ఏం ఉద్యోగాలు చేయాలి? ఎవరిస్తారు ఉద్యోగాలు? మన దేశ జనాభాలో మూడింట ఒకవంతు ఆమెరికా జనాభా. మనదేశంలో ఒక రాష్ట్రానికంటే చిన్నది జపాన్. ఈ రెండు దేశాలు పోటీలు పడుతూ సాధిస్తున్న ప్రగతి? ఆ దేశాల్లో ఒక్కడు పదిమందికి జీవన భృతి కల్పిస్తే ఈ దేశంలో పదిమంది అలాంటి ఒక్క వ్యక్తికోసం ప్రాకులాడుతున్నారు. ఓపినంత జనాభా. వలసినన్ని వనరులు. చూస్తూ చూస్తూ వృథా అయిపోతున్నాయి కదా? కనీసం హైస్కూలు చదువుకు కూడా నోచుకోలేని ఒక వ్యక్తి తాను బతకడమేకాదు– పదిమందికి జీవనోపాధి కల్పించాడు"

"అందరూ అతనిలాగానే విజయాన్ని సాధిస్తారన్న నమ్మకం ఎక్కడుంది?"

"నాన్నా! మీరు ఒక ఉపాధ్యాయుడుగా తరగతినంతా కూర్చోబెట్టుకొని పాఠం చెబుతారు. ఎవడి గ్రహణశక్తి వాడిదేగదా? చేపట్టిన ఏ ప్రయత్నమైనా శ్రద్ధాసక్తులమీద ఆధారపడి ఉంటుంది"

"కానీ అతడు మొక్కగానే వంగాడు"

"హుం! మానై నేను వంగడం కష్టమంటారా? కాదనను. ఇనుమును కొలిమిలో పెట్టి బాగా కాచి కొట్టితేనేగదా పనికొచ్చే పరికరంగా రూపొందుతుంది. నేను చదివిన చదువు...సాధించిన పరిజ్ఞానానికి అనుభవం తోడైతే ఈ కంప్యూటర్ యుగం నాకాళ్ళమీద నన్ను నిలబెడుతుందనే నా విశ్వాసం"

ఆచార్యులు కొడుకు మొగంలోకి తదేకంగా చూస్తున్నారు.

"నాన్నా! మీరు నమ్మి అనుసరిస్తున్న ఆధ్యాత్మచింతన మనిషిని క్రమబద్ధం చేస్తుందేమోకానీ– పురోగమనానికి మాత్రం దోహదం చేయదు. మీరు చదువులలో మర్మం తెలిసిన గురువు. అయితే మీ శిష్యుడు జీవితమర్మం విడమరిచి చెప్పిన పరమగురువు. ఆ పరమగురువు ప్రేరణతో నేను మూడు వేళ్ళతో పట్టిన కలాన్ని వదిలి పెడుతున్నాను. ఇప్పుడు మూడువేళ్ళకు మరొక రెండువేళ్ళుతోడు. అయిదునేళ్ళను బిగించితే పిడికిలి. పిడికిలి బిగించడమంటే శ్రమశక్తి! ఈ లోకంలో శ్రమశక్తికి ఎదురులేదు. ఏలోటూ రాదు. ఈ డబ్బు నేను తీసుకొంటున్నాను. ఉచితంగా కాదు. అప్పుగానే. అప్పు తప్పు అన్న రోజులు మీవి. అప్పు చేయక తప్పదన్నరోజులు మావి. ఈ అప్పు నా ప్రయత్నాలకు పెట్టుబడి. నన్ను ఆశీర్వదించండి"

ఈతరానికి తనకొడుకు ప్రతినిధి అని ఆయనకు తెలుసు. అయినా ఆయన తల నిండుకా ప్రశ్నార్థకాలే! ●

విపుల
(1, సెప్టెంబర్ 1996)
తెలుగు కథ 1996, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం